14052025-DIS-04_Layout 1 5/14/2025 3:53 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# మూడో పక్షం మధ్యవర్తిత్వమా?

ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలనుద్దేశించి సోమవారం రాత్రి చేసిన ప్రసంగంలో చాలా విషయాలు స్పృశించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా చేపట్టిన పలు చర్యల గురించి ఆయన సోదాహరణంగా చెప్పుకొచ్చారు. శత్రువుతో ఎంత కఠినంగా వ్యవహరించిందీ, ఎంతటి విధ్వంసం సాగించిందీ విజయగర్వంతో విషదీకరించారు. అదే సమయంలో ఆయన 'ఇది యుద్ధాల యుగం కాదని' అన్నారు. నిజమే సాగిస్తే సమరం. ఆపేస్తే శాంతి. ఇదంతా రణ విరమణ తంతు గురించి వివరంగా తెలుసుకుందాం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టాంటాం వేసుకుంటున్న మధ్యవర్తిత్వం గురించి మాట వరసకైనా మోదీ ప్రస్తావించకపోవడం గమనార్హం. కశ్మీర్‌తో సహా భారత్-పాకిస్థాన్ మధ్య ఉన్న సమస్యలకు మధ్యవర్తిత్వం అనేది పొసిగే వ్యవహారం కాదు. మొదటి నుంచీ భారత్ ఇదే వైఖరిని అవలంబిస్తున్న సంగతి తెలిసిందే. మూడో పక్షం మధ్యవర్తిత్వం అనేది ఇక్కడ పూర్తిగా నిషిద్ధం. అక్కడ ట్రంపేమో ఇండియా-పాక్ బుద్ధిగా చెప్పిన మాట విన్నారని మెచ్చుకోలుగా రెచ్చిపోతున్నారు. వినకపోతే వ్యాపారం మానేస్తానని బెదిరించినట్టు కూడా ఆయన సాంఘిక మాధ్యమాల సాక్షిగా గుట్టురట్టు చేస్తున్నారు.

బంగ్లా యుద్ధం తర్వాత భారత్-పాక్ కుదుర్చుకున్న షిమ్లా ఒప్పందంలో ఏముంది? అన్ని సమస్యలు ద్వైపాక్షికంగానే పరిష్కరించుకోవాలని ఆ ఒప్పందం విస్పష్టంగా నొక్కిచెప్పింది. మరి మధ్యవర్తిత్వం ఎక్కడినుంచి వచ్చింది? అందులోనూ కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా కలిసిపోమని, గ్రీన్‌ల్యాండ్‌ను బల ప్రయోగంతో కలిపేసుకుంటామని విస్తరణవాద అజెండాతో ఊదరగొట్టే అమెరికా అధ్యక్షుడు ఇక్కడ సమస్య కొలిక్కి వస్తున్న లేదా తుది ఘట్టానికి చేరుకుంటున్న దశలో హఠాత్తుగా ఊడిపడి శాంతి మంత్రాంగం నెరపడం ఏమిటో పండితులకే అర్థం కావడం లేదు. ఇంక సామాన్యుల మాట చెప్పేదేముంది? మత మౌఢ్యం చేతికి తుపాకులిచ్చి ఇండియా మీదికి ఎగదోసి తమాషా చూస్తున్న కిరాతక పొరుగు దేశం ఇరికి ఇగిలించిదేమో... ఇండియాకు ఏమయ్యింది. మధ్యవర్తిత్వమే ఇక్కడ నిషేధమైన నేపథ్యంలో, అదీ నా మాటే శాసనమని దడిపిస్తున్న అమెరికా అధ్యక్షుని మధ్యవర్తిత్వంలో రణ విరమణా? ఇదంతా ఏమిటనే సందేహాలను తీర్చకుండానే యుద్ధాలకు ఇది యుగం కాదనీ, తీవ్రవాదానికీ ఇది కాలం కాదని ప్రవచనాలివ్వడం ఏమిటి? మూణ్నాళ్లకే అస్త్ర సన్యాసం చేయాల్సినంత పెద్ద ఫలితం ఏం లభించిందని? హఠాత్తుగా కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత 48 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ తెరమీదికి వచ్చి ఏదో సాధించినట్టుగా ఏకరువు పెట్టడమేమిటి? అందుకే ప్రస్తుత కేంద్ర నాయకత్వం వ్యవహార శైలిపై ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

భారత సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షకులమని ఊరేగే వారేనా అమెరికా ముందు మోకరిల్లింది? అని పరిపరి విధాలా విస్తుపోతున్నారు. ఈ సందర్భంగా నాటి ఇందిరాగాంధీ అనుసరించిన స్వాభిమాన వ్యవహారశైలిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. బంగ్లా యుద్ధం సమయంలో అమెరికా పాకిస్థాన్ పక్షాన నిలిచింది. ఇండియాను నానా రకాలుగా లొంగదీసుకునేందుకు ఎత్తులు వేసింది. బంగాళాఖాతంలోకి శక్తిమంతమైన సప్తమ నౌకా దళాన్ని అమెరికా పంపించడం భారత్ ఎన్నటికైనా మరిచిపోగలదా? అన్నిటినీ ఎదిరించి పాక్‌ను రెండు ముక్కలు చేసి బంగ్లాదేశ్‌ను స్థాపించి ఐరన్ 'లేడీ'గా, మా 'దుర్గ'గా మన్ననలు అందుకున్న ఇందిర ఇప్పుడు దేశ ప్రజలకు గుర్తుకురావడంలో వింతేముంది? ఇదంతా చరిత్ర. శిలా లిఖితం. భావితరాలు పోల్చిచూసుకునే గీటురాయి. అసలు అనేక అంశాలపై కేంద్రం మౌనముద్ర వహించడం దేశ ప్రజలకు మింగుడు పడటం లేదు. అందులో అతి ముఖ్యమైంది పాక్‌కు ఐఎంఎఫ్ రుణం. ఓ వైపు ఇండియా సైనిక చర్యలో తలమునకలుగా ఉంటే అటు భారీగా ఐఎంఎఫ్ రుణం ఇప్పించడంలోనూ అమెరికా క్రియాశీల పాత్ర పోషించింది. నిన్నా మొన్నా ఇండియాపై పాక్ ప్రయోగించిన అనేక ఆయుధాలు అమెరికా సమకూర్చినవే. గాజాలో నరమేధం సృష్టిస్తున్న ఇజ్రాయెల్‌ను పల్లెత్తు మాట అనని అమెరికా ఇండియా-పాక్ మధ్య శాంతి పేరిట దూరిపోవడం మాత్రం వింతల్లోకెల్లా వింత.

# విరమణకు అంత తొందరెందుకు?

పాకిస్థాన్ ప్రేరేపిత కశ్మీరీ జీహాదీలు పహల్గాంలో 26 మందిని ఊచకోత కోసిన రెండు వారాలకు భారత్ స్పందించింది. ఏప్రిల్ 22న కశ్మీర్ మారణకాండ జరిగితే, మే 7న భారత సైనిక దళాలు పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలను దాడులతో ధ్వంసం చేశాయి. అనంతరం పాక్ భూ భాగంలోని లాహోర్ సహా అనేక ప్రాంతాలపై భారత సైన్యం దాడులు చేసి పాక్ ఆర్మీపై పైచేయి సాధించింది.



నాంచారయ్య మెరుగుమాల



**1999** కార్గిల్ పోరు తర్వాత ఇండియా-పాకిస్థాన్ మధ్య 26 ఏండ్లకు జరిగిన యుద్ధం నాలుగు రోజులకే మే 10న ముగిసిపోయింది. ఉభయ దేశాలూ కాల్పుల విరమణ పాటించనున్నట్టు మొదట అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం మధ్యాహ్నం ప్రకటించడంతో యుద్ధం ముగిసిందనే వార్త భారత ప్రజలకు చేరింది. రెండు దాయాది దేశాల మధ్య పోరు ఆగిందనే సమాచారం ప్రపంచ ఏకైక అగ్రరాజ్యం అధ్యక్షుడు ట్రంప్ ఎందుకు ప్రకటించాల్సి వచ్చిందనే విషయం తర్వాత చర్చించవచ్చుగాని, ఇంత హడావుడిగా ఉరుము ఉరిమినట్టు యుద్ధం నిలిపివేయడానికి భారత ప్రభుత్వం ఎందుకు అంగీకరించాల్సి వచ్చిందో ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర కేంద్ర మంత్రులు, విదేశాంగ కార్యదర్శి వంటి ఉన్నతాధికారులు ఇంతవరకు వెల్లడించలేదు. కిందటి బుధవారం భారత వైమానిక దళం పాకిస్థాన్ పంజాబ్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులు జరిపి వాటికి ఎనలేని నష్టం కలిగించి ధ్వంసం చేశాక యుద్ధం తీవ్రమయ్యే దిశగా సాగింది. రెండు భారత ఉపఖండ దేశాల మధ్య యుద్ధం 1971 భారత-పాక్ యుద్ధం మాదిరిగా 13 రోజులకే ముగుస్తుందా? లేక నెల రోజులు సాగుతుందా? అనే ప్రశ్నలు దేశ ప్రజలను ఆలోచనల్లో పడవేశాయి.

> 140 కోట్ల మందికి పైగా ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన పహల్గాం ఊచకోత తర్వాత భారత సర్కార్ పాకిస్థాన్‌పై ఎట్టకేలకు సైనిక చర్య తీసుకోవడం సబబేననే అభిప్రాయం మెజారిటీ జనానికి కలిగింది. అయితే, నాలుగు రోజుల యుద్ధంలో అన్నివిధాలా భారత్ తిరుగులేని ఆధిక్యం సాధించడం భారతీయులకు ఎంతగానో గర్వకారణమైంది. పాక్ గగన తలం నుంచి దూసుకువస్తున్న డ్రోన్లు, ఇతర విధ్వంసక క్షిపణులను భారత గగన రక్షణ వ్యవస్థ తిప్పికొట్టడం చూసి ఇండియా సైనిక దళాల ఆధునికీకరణ ఇంత బాగా జరిగిందా? అనే ఆలోచన భారత ప్రజలను ఆనందింపజేసింది.

**36 గంటల్లో భారత్ దాడి చేస్తుందని చెప్పిన పాక్‌లో లేని యుద్ధ సన్నద్ధత:** పహల్గాం మారణకాండ జరిగిన వారానికి పాక్ మంత్రులు, ఉన్నతాధికారులు మరో 36 గంటల్లో ఇండియా తమ దేశంపై దాడి చేయబోతోందని భయాందోళనలు వ్యక్తం చేస్తూ ప్రకటనలు చేశారు. దేశ ఆవిర్భావం నుంచీ పెత్తనం చేస్తున్న పాకిస్థాన్ ఆర్మీ యుద్ధానికి సన్నద్ధం కాలేదు. ఒకవేళ భారత సేనలు తమపై దాడికి సాహసం చేసినా అవి సర్జికల్ స్ట్రయిక్స్ పేరుతో పిలిచే మెరుపు దాడులకు పరిమితమౌతాయనే భ్రమల్లో పాక్ అధికారులున్నారు. భారత సైనిక దళాల దాడులు పాక్ ఆక్రమిత కశ్మీర్ వరకే సాగుతాయనే ధీమా పాక్ ఆర్మీలో వ్యక్తమైంది. ఇండియా మాదిరిగానే పాకిస్థాన్ కూడా అణ్వాయుధాలున్న దేశం కాబట్టి తమపై భారీ స్థాయిలో దాడికి భారత రక్షణ దళాలు ముందుకురావనే మితిమీరిన నమ్మకం 'పాక్ కమాండర్ల'లో ఎప్పటి నుంచో ఉన్నది. ఆ నమ్మకమే పాకిస్థాన్ నేరుగా భారత్‌పై యుద్ధం చేయకుండా తన చెప్పుచేతుల్లో ఉండే జీహాదీల ద్వారా భారతీయులను గాయపరిచే పనులు చేస్తున్నది. పేరుకే ప్రజాస్వామ్యం ఉన్న ఈ ఇస్లామిక్ రిపబ్లిక్‌లో ఎన్నికైన నాయకులను కీలుబొమ్మలను చేసి పాక్ ఆర్మీ ఆడిస్తున్నది. పాక్‌లో అనేక మంది ప్రధానులు, అధ్యక్షులు ఎన్నికల్లో ఓడిపోవడం ద్వారా గాక ఆర్మీ ఆదేశాలతో పదవీచ్యుతులవడం ఇటీవల చరిత్రే.

1947 ఆగస్టు మధ్యలో ఇండియాతోపాటే స్వాతంత్ర్యం సంపాదించిన పాకిస్థాన్ రాజ్యాంగ రచన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థను వేళ్లూనుకునేలా చేయడంలో విఫలమైంది. 1953లో లాహోర్ వంటి నగరాల్లో ముస్లిం వర్గాల (అహ్మదీయులకు ఇతర ముస్లింలకు) మధ్య జరిగి హింసాత్మక ఘర్షణల్లో అనేక మంది మరణించారు. 1974లో నాటి జుల్ఫికర్ అలీ భుట్టో ప్రభుత్వం ముస్లింలుగా పరిగణించే అహ్మదీయులను ముస్లిమేతరులుగా పార్లమెంట్‌లో చట్టం ద్వారా ప్రకటించడంతో మరోసారి పాక్ నగరాల్లో అల్లర్లు జరిగాయి. ఇలాంటి ఘర్షణల సమయంలో పాక్ ఆర్మీ రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసి శాంతిని పునరుద్ధరించిన సందర్భాలున్నాయి. అందుకే పాకిస్థాన్‌లో సైనిక పాలన తరచూ విధించడానికి ప్రకటించే మార్షల్ లాను పాక్ జనం దేవుడే తమను సైనిక దళాల జోక్యం ద్వారా కాపాడాడ నమ్మకంతో 'మాషా అల్లా' (అల్లా కోరుకున్నదే జరిగింది) అని పిలిచేవారనే కథనాలెన్నో పాక్ మీడియాలో వచ్చాయి. అయితే, మూడు దశాబ్దాలకే దేశం లోపల మంచి పేరును పాక్ ఆర్మీ పోగొట్టుకున్నదని, జనంలో దానిపై పూర్వపు ఆదరాభిమానాలు లేవని 2023 మే ఘటనలు నిరూపించాయి. ప్రస్తుత పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ అధికారంలో ఉండగా అప్పుడు సైన్యం సాయంతో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను అన్యాయంగా అరెస్టు చేశారని ఆగ్రహించిన పాక్ ప్రజలు పాక్ ఆర్మీ ప్రధాన కార్యాలయం (జీహెచ్‌క్యూ) సహా రావల్పిండి, లాహోర్‌లోని అనేక ఆర్మీ కీలక ఆఫీసులపై దాడులు చేయడం పాక్ సర్కారు సహా ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతపరిచింది. అంటే రాజకీయపక్షాలపై లేని ప్రజావిశ్వాసం కొన్ని దశాబ్దాలపాటు కలిగి ఉన్న పాక్ ఆర్మీ పూర్తిగా జనం నమ్మకం కోల్పోయింది.

**1990ల నుంచీ ఆధునికీకరణ లేని పాక్ ఆర్మీ:** బ్రిటిష్ ఇండియా సైనిక దళాల్లో పనిచేసిన అనుభవంతో 1947లో పాక్ ఆర్మీలో చేరిన ఉన్నతాధికారులు, ఇతర సైనికులు ఆరంభంలో వృత్తి నైపుణ్యం ఉన్న 'ఆఫీసర్లు'గా చలామణి అయ్యారు. ప్రజా ప్రభుత్వాలు బలహీనంగా ఉండటం, ఇస్లామిక్ రిపబ్లిక్ పేరిట జనరల్ జియా ఉల్ హక్, జనరల్ పర్వేజ్ ముషారఫ్ వంటి సైనిక పాలకులు సైన్యంలో తాము రూపొందించిన 'ఇస్లామిక్ ధోరణులు' ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసీం మునీర్ వరకూ ఇస్లాంను సైనిక, ప్రజా వ్యవహారాల్లోకి చొప్పించి ఆర్మీ పునాదులను బలహీనం చేశారు. ఆర్మీ అనేక ముఠాలుగా చీలిపోవడానికి పూర్వపు 'వృత్తి నైపుణ్యం' పోవడానికి కారకులయ్యారు. ఇంతటి బలహీన స్థితికి పాక్ సైనిక దళాలు చేరుకున్నాయి.

> పాక్ దగ్గరున్న ఆయుధ సామగ్రి రెండు మూడు వారాల యుద్ధానికి తగినంత లేదనే వార్తలు పాక్ నుంచి మొన్న వచ్చాయి. అసలే ఆర్థిక ఇబ్బందుల్లో పాక్ ప్రజలు ఇండియాతో పూర్తి స్థాయి యుద్ధం రాబోతోందని తల్లడిల్లిపోయారు. కరాచీ, లాహోర్ సహా అనేక పెద్ద నగరాల్లో ప్రజలు యుద్ధభయంతో వణికిపోయారు. ఎన్నెన్నో ఆయుధాలున్న పాక్ చివరికి డ్రోన్లతోనే ఆ రెండు మూడు రోజుల యుద్ధాన్ని నెట్టుకొచ్చిందంటే పాకిస్థాన్ ఆర్మీ ఎంతటి పతనావస్థకు చేరుకున్నదో అంచనా వేయవచ్చు.

ఆక్రమిత కశ్మీర్, అతి పెద్ద రాష్ట్రమైన పాక్ పంజాబ్‌లోని ఉగ్రవాద తండాల శిక్షణ శిబిరాలపై భారత సేనలు దాడులు జరిపి వాటిని నేలమట్టం చేస్తుంటే పాక్ దళాల నుంచి ఒక మోస్తరు ప్రతిఘటన కూడా లేదంటే పాకిస్థాన్ కేవలం విఫల రాజ్యం, రోగ్ స్టేట్ మాత్రమే కాదు దివాళాకోరు దేశం అని నాలుగు రోజుల పోరాటం తేల్చిచెప్పింది.

**చేవ చచ్చిన పాక్‌తో కాల్పుల విరమణకు ఇంత తొందర ఎందుకో!:** ఈ నేపథ్యంలో ప్రపంచంలో ఏకైక అగ్రరాజ్యం, 'గ్లోబల్ పోలీస్'గా పేరుమోసిన అమెరికా చెప్పగానే భారత ప్రభుత్వం పాక్‌తో ఎందుకు కాల్పుల విరమణకు అంగీకరించింది? అనేది అతి పెద్ద చిక్కు ప్రశ్నగా మారింది. నాలుగు రోజుల కిందటమొదలైన యుద్ధం ఇక ఉధృతంగా ముందుకు సాగుతుందని, తీవ్రస్థాయిలో పోరు ముదురుతుందని వార్తలు వచ్చిన సమయంలో కాళ్ల బేరానికి సిద్ధమౌతున్న పాక్‌తో కాల్పుల విరమణకు ఇండియా ఎందుకు అంగీకారం తెలిపింది? భారత సైనిక దళాల నాయకత్వం ఎప్పుడూ లేని విధంగా ఇంత అర్జంటుగా పోరుకు స్వస్తి పలకడానికి ఎలా సిద్ధమైంది? అనే ప్రశ్నలు వ్యూహాత్మక, రక్షణ వ్యవహారాల నిపుణులనేగాక సామాన్య ప్రజలను కూడా వేధిస్తున్నాయి. 1971 బంగ్లాదేశ్ యుద్ధం' ముందు ఆ తర్వాత పాక్ విషయంలో ఇండియాకు అంత దూకుడు పనికిరాదనే ధోరణితో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్, ఆ దేశ విదేశాంగ మంత్రి హెన్నీ కిసింజర్ మాటలను నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఎలా తిప్పికొట్టారో, అగ్రరాజ్యం నేతల మాటలను పెడచెవిన పెట్టి ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగారో తెలిసిందే. అలాంటిది పాకిస్థాన్ 77 ఏండ్ల చరిత్రలో అత్యంత బలహీనమైన ప్రధాని షహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని సంకీర్ణ సర్కారుతో అత్యంత బలవంతుడిగా, ఇందిర తర్వాత అంతటి శక్తిసంపన్నుడిగా పేరు గడించిన నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం సరైన తక్షణ కారణాలు చూపించకుండానే యుద్ధ విరమణకు ఒప్పుకోవడం భారతీయులకు మింగుడు పడడం లేదు.

ట్రంప్ తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' ద్వారా కాల్పుల విరమణ కబురును వాయు వేగంతో ప్రకటించారు. ఇక ఈ యుద్ధంలో విజయ పరంపరతో దూసుకుపోతున్న ఇండియా మంత్రులు లేదా అధికారులు ఎలాంటి దాపరికం లేకుండా పారదర్శకంగా కాల్పుల విరమణకు కారణాలు వివరించకపోవడం దేశ ప్రజలను ఆశ్చర్యపరిచింది. దాయాది దేశంతో యుద్ధం నెలల పాటు కొనసాగాలని ఏ ఒక్క పౌరుడూ కోరుకోడు. 1962, 1965, 1971 యుద్ధాలు భారతదేశాన్ని ఎంతగా దెబ్బతీశాయో ప్రజలకు తెలియనిది కాదు. మనది కాని భూభాగాన్ని తన నియంత్రణలో దీర్ఘ కాలం ఉంచుకోవడం ఎంత కష్టమైన పనో ఇజ్రాయెల్‌లోని పాలస్తీనా ప్రాంతాలు నిరంతరం రుజువు చేస్తున్నాయి. అలాంటిది కొందరు భారతీయులు చెబుతున్నట్టు ఈ యుద్ధాన్ని ముందుకు సాగదీసి లాహోర్ సహా అనేక పాక్ ప్రాంతాలను శాశ్వతంగా భారత అధీనంలో ఉంచడం కుదిరే పని కాదు. యుద్ధం ఆపించాలంటూ అమెరికా శరణుజొచ్చిన పాక్ ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీలు, రాయితీలు పొందకుండా యుద్ధం ఎందుకు ఆపేశారు? అని ప్రజలు అడుగుతున్నారు. 1971 భారత్-పాక్ యుద్ధం ముగిసినప్పుడు లాహోర్ వరకూ వెళ్లిన భారత సేనలు ఎందుకు వెనక్కి రావాలి? అని మితిమీరిన 'దేశభక్తి'తో కొందరు అనాలోచితంగా వేసిన ప్రశ్నలు కావివి. 1972 షిమ్లా ఒప్పందం ప్రకారం కశ్మీర్ సమస్యను ఇండియా, పాక్‌లే పరిష్కరించుకోవాలన్న సూత్రాన్ని ట్రంప్ ప్రకటన ఉల్లంఘించలేదా? అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. ప్రభుత్వం ఈ హడావుడి యుద్ధ విరమణపై జనంలో రేకెత్తిన అనుమానాలను ఎంత త్వరగా నివృత్తి చేస్తే అంత మంచిది.

దాయాది దేశంతో యుద్ధం నెలల పాటు కొనసాగాలని ఏ ఒక్క పౌరుడూ కోరుకోడు. 1962, 1965, 1971 యుద్ధాలు భారతదేశాన్ని ఎంతగా దెబ్బతీశాయో ప్రజలకు తెలియనిది కాదు. మనది కాని భూభాగాన్ని తన నియంత్రణలో దీర్ఘకాలం ఉంచుకోవడం ఎంత కష్టమైన పనో ఇజ్రాయెల్‌లోని పాలస్తీనా ప్రాంతాలు నిరంతరం రుజువు చేస్తున్నాయి. అలాంటిది కొందరు భారతీయులు చెబుతున్నట్టు ఈ యుద్ధాన్ని ముందుకు సాగదీసి లాహోర్ సహా అనేక పాక్ ప్రాంతాలను శాశ్వతంగా భారత అధీనంలో ఉంచడం కుదిరే పని కాదు. యుద్ధం ఆపించాలంటూ అమెరికా శరణుజొచ్చిన పాక్ ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీలు, రాయితీలు పొందకుండా యుద్ధం ఎందుకు ఆపేశారు? అని ప్రజలు అడుగుతున్నారు.

**'దురాశ దుఃఖానికి చేటు' అన్న సామెత తెలుగు ప్రజలకు బాగా తెలుసు. ఆరు దశాబ్దాల ఉద్యమ పోరు, అన్యాయమైన మూడు తరాలు, అమరులైన వందల మంది (2004 నుంచి 2014 దాకానే 1200 మంది పైన) యువకులు, నక్సలైట్లన్న నెపంతో చంద్రబాబు హయాంలో జిల్లాకు 300 మందికి పైన చంపబడిన యువత, మూసివేయబడిన విద్యాసంస్థలు, తరలించుకుపోయిన తెలంగాణ నిధులు, దిగువ ఆంధ్రా ప్రాంతానికి పారిన కృష్ణా, గోదావరి నదీజలాలు, దోచుకోబడిన తెలంగాణ వనరులు, ఆక్రమింపబడిన ప్రభుత్వ ఉద్యోగాలు, కబ్జాలకు గురైన వేలకొద్దీ ఎకరాలు, రాజధాని భూమి-1956 నుంచి 2014 దాకా ఎవరైనా తెలంగాణ ప్రాంత చరిత్ర రాయదల్చుకుంటే విశ్లేషించి, చర్చించాల్సిన అంశాలు ఇవీ..!**

# ఏ పాలన బాగుంది?



కనకదుర్గ దంటు
89772 43484



వివరంగా రాయాలంటే ఇంకా విశేషాలున్నాయి. ఆంధ్రా ప్రాంతానికి మేలు చేయటానికి కిందికి జరిపి కట్టిన నాగార్జున సాగర్ ఆనకట్టను దిగులుగా చూస్తూ విజయపురి దగ్గర ఆ డామ్ శంకుస్థాపన చేసి వేసిన శిలాఫలకం, ఎన్నికల ముందు హడావుడి చేసి హెలికాప్టరులో వెళ్లి దేవాదులకు చంద్రబాబు వేసిన శిలాఫలకం, డాములు కట్టకుండా కేవలం కాలువలు తవ్వి తెలంగాణ వారిని భ్రమల్లో ముంచి తన కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించిన వైఎస్ఆర్ తవ్విన కాలువలు, హైదరాబాద్ నగరం మధ్యలో హైదరాబాద్ రాష్ట్ర చరిత్ర తెలియని, మద్రాసు నగరం ఆంధ్రకు కావాలని నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన పొట్టి శ్రీరాములు పేరు మీద ఉన్న తెలుగు యూనివర్సిటీ, సూఫీ తత్త్వవేత్త హసేన్ షావలీ కనుక్కున్న సరస్సు మీద 30 మంది తెలంగాణ ప్రజలకు తెలియని ఆంధ్రావారి విగ్రహాల మధ్య బిక్కుబిక్కుమంటూ ఉన్న 3 తెలంగాణ వారి విగ్రహాలు, హైదరాబాద్ నిండా తెలంగాణ ప్రజలను వెతలకు గురిచేసిన ఆంధ్ర రాజకీయ నాయకుల విగ్రహాలు, వారి పేర్ల మీద వెలిసిన కాలనీలు, పార్కులు, ఇంకా ముఖ్యంగా చెప్పాలంటే వందల మంది రైతులను భయపెట్టి, బాధపెట్టి ఎకరం రూపాయికి తీసుకొని వేల ఎకరాలను తన వర్గం వారికి అమ్ముకొని సొమ్ము చేసుకొని ఒక డబ్బా బిల్డింగ్ కట్టి మొత్తం హైటెక్‌సిటీలోని సైబరాబాద్ పేరు మీద తానే నిర్మించానని చంద్రబాబు చెప్పుకొనే ఆ ప్రాంతంలో అన్యాక్రాంతమై జయభేరి మోగిస్తున్న ఆంధ్ర కాలనీలు ఆఫీసులు, విద్యాసంస్థలు! తానే హైదరాబాద్ నగరాన్ని నిర్మించాననీ, అంతకంటే ముందు ఈ ప్రాంతంలో చదువన్నదే లేదనే చంద్రబాబు కోసం ఈ కింది విషయాలు పొందుపరచాలి చరిత్రకారులు.

నిజాముల కాలంలో పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు స్థాపించబడి, ఇక్కడి వైద్యుల కోసం ఇరాన్, ఇరాక్ ఇంకా ఇతర మధ్య తూర్పు దేశాల వారు చికిత్సలు, ఆపరేషన్ల కోసం వచ్చేవారు. ఉస్మానియా యూనివర్సిటీ (1918) మొట్టమొదటి స్థానిక భాషా మాధ్యమం (ఉర్దూ)లో భారతదేశంలో స్థాపించబడింది. ఈ విశ్వవిద్యాలయ స్థాపన కంటే ముందుగా స్థాపింపబడిన నిజాం కళాశాల (1887) అప్పుడు మద్రాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండేది. అంటే, చంద్రబాబు పుట్టేకంటే సుమారు ఆరున్నర దశాబ్దాల ముందు ప్రభుత్వ జెనానా పాఠశాల (1885), ప్రధాని సాలార్‌జంగ్ స్థాపించిన ఓరియంటల్ కళాశాల మూడు భాషా మాధ్యమాలలో -అరబిక్, పర్షియన్, ఇంగ్లీషు, తర్వాత తెలుగు, మరాఠీ మాధ్యమాలలో కూడా విద్యను అందించింది. అంతకంటే ముందు నిజాం ఫక్రుద్దీన్ ఖాన్ 1829లోనే భౌతికశాస్త్రం, గణితం, ఖగోళశాస్త్రం, తత్వశాస్త్రాలు బోధించటానికి ఓరియంటల్ పాఠశాల ప్రారంభించాడు. 1839లోనే ఇక్కడ మెడికల్ కాలేజీ ఉండింది. ఇప్పటికీ నడుస్తున్న సెయింట్ జార్జి గ్రామర్ స్కూల్ ఇంగ్లీషు మాధ్యమంలో 1834లో ప్రారంభించబడింది. సెయింట్ ఫ్రాన్సిస్ స్కూలు 1850లోనూ, రోజు రీ కాన్వెంట్ హైస్కూల్ 1904లోనూ ప్రారంభించబడ్డాయి. హైదరాబాద్ రాష్ట్రంలో లెక్కలేనన్ని పాఠశాలలు, కళాశాలలు, వృత్తి విద్యా, సాంకేతిక విద్యా కళాశాలలు, 11 ప్రత్యేక చికిత్సల (స్పెషాలిటీ ప్రకారం) వైద్యశాలలు అంటే ఫీవర్ ఆస్పత్రి, బొక్కల దవాఖాన, చెవి, ముక్కు, గొంతు ఆస్పత్రి వంటివి స్థాపించబడినాయి. అంటే బ్రిటిష్ వారి కాళ్లు కడిగి ఆంధ్రవారు నెత్తిన జల్లుకుంటున్న కాలంలో, ఇక్కడ లండన్ నుంచి వచ్చి నిజాముల దగ్గర ఉద్యోగులుగా జీతాలు తీసుకుంటూ వారికి సలాము చేసే బ్రిటిష్ ఉపాధ్యాయులు ఎందరో ఉండేవారన్న మాట. అదీ అసలైన తెలంగాణ!

ఇంకొక మాటలో చెప్పాలంటే 1956 దాకా ఎంతో సంపన్న రాష్ట్రంగా, ఉన్నతమైన సంస్కృతి కలిగి ఉన్న తెలంగాణ, ఉమ్మడి రాష్ట్రంలో తన కీర్తిని, ఉనికిని కోల్పోయింది. ఎప్పుడూ అన్నీ తనే చేశానని గొప్పలు (స్వోత్కర్ష అంటారు, దీన్ని గురించి వేదం ఏమంటుందంటే - 'నిజమైన గొప్ప వాడిని ఇతరులు పొగుడుతారు, అధములు తమను తామే పొగుడుకుంటారు' అని.) చెప్పుకొనే చంద్రబాబు పుట్టకముందు ఒక శతాబ్దం + మూడు దశాబ్దాల (163) ఏండ్లు కాలం ముందే విద్యారంగం తెలంగాణలో ఉండింది. అంతే కాదు, ఆరు భాషా మాధ్యమాలలో -అరేబిక్, పర్షియన్, ఉర్దూ, తెలుగు, మరాఠీ, కన్నడం - విద్యార్థులకు విద్యను అందించింది. మరి తెలంగాణకు సుద్దులు నేర్పానని చెప్పే చంద్రబాబు మొదటి ఐదేండ్ల పాలనలో ఒక్కటీ చక్కనైన భవనం కట్టలేక పోయాడెందుకు అమరావతిలో? లక్ష వేల ఎకరాలు రాజధానిగా పరిగణించరనీ, అందులో వసతులుంటేనే పాలన జరుగుతుందనీ తెలియదా?

> ఇక ఆయన శిష్యగణంలో అత్యంత ఆప్తుడు, కాస చియాంకా లాంటి మన ప్రస్తుత సీఎం పాలనలో, వలస పాలకులను మించిపోతున్నాడు. భౌతికంగా కాంగ్రెస్ పార్టీలోనూ, మానసికంగా టీడీపీలోనూ రెండు పాత్రధారుల వలె మసలుతున్న వీరి మూడో ఆత్మీయబంధం మత తత్త్వ బీజేపీతో సాగుతోంది. పాలనలో ఈ మూడు పార్టీల మనిషి లాగ తెలంగాణ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నా, వ్యక్తిగతంగా ఆయన నాలుగో పాత్రధారి.

ఇక్కడ మహాభారతంలోని ఒక పాత్ర గురించి మాట్లాడుకోవాలి. ఆయన పేరు పౌండ్రక వాసుదేవుడు. వాసుదేవుడి కుమారుడు కాబట్టి శ్రీకృష్ణుడిని వాసుదేవుడని కూడా అంటారు. మరి ఈ వాసుదేవుడు ఎంత విచిత్ర వ్యక్తో తెలుసుకుంటే మన ప్రస్తుత సీఎం తత్వం మనకు అర్థమవుతుంది. ఈ రెండో వాసుదేవుడు పౌండ్ర రాజ్యానికి రాజు. కంసుడి మామ జరాసంధుడి స్నేహితుడు. శ్రీ కృష్ణుడికి ప్రజలు, పాండవులు ఇచ్చే గౌరవం, ఆదరం చూసి పట్టలే ని అసూయతో ప్రవర్తిస్తాడు. అయితే కృష్ణుడు, చేతకానివాడని, తనే కృష్ణుడిని అని నమ్మించటానికి ప్రయత్నిస్తాడు. శ్రీకృష్ణుడి కౌస్తుభం లాగ తాను కూడా ఒక మణిని తాడుతో హృదయం మీద అమర్చుకుంటాడు. పట్టు పీతాంబరాలు ధరించి నెమలీక కూడా నెత్తిన పెట్టుకుంటాడు, పూలమాల ధరిస్తాడు. ఇన్ని చేసినా ఎవరూ ఆయనను గొప్పవాడని గుర్తించకపోగా, ఆయన ఉనికినే పట్టించుకోరు. ఇది భరించలేక శ్రీకృష్ణుడికి తనే గొప్పవాడని ప్రజలకు చెప్పమనీ, లేకపోతే యుద్ధం చేసి చంపేస్తాననీ బెదిరిస్తాడు. ఆ యుద్ధంలో తన నకిలీ చక్రంతో కృష్ణుడిని చంపుదామని ప్రయత్నించి, శ్రీకృష్ణుడి చేతిలో తానే హతమవుతాడు.

మరి ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్నికల ముందే పైన చెప్పిన విధంగా తెలంగాణ మొదటి ముఖ్యమంత్రితో పోలిక మొదలుపెట్టాడు. ఎన్నికల ప్రసంగంలో కేసీఆర్‌కు హుస్నాబాద్ సెంటిమెంట్ అయితే, తనకు వికారాబాద్ సెంటిమెంట్ అని ప్రకటించాడు. ఇక అది మొదలు పబ్లిక్, ప్రైవేట్ అసెంబ్లీలో - ప్రసంగం ఏదైనా అసలైన పాలకుని పేరు ఎత్తకుండా మాట్లాడలేదు. చేసిన పథకాలు కూడా ఉన్నవాటిని పెంచి చెప్పాడే కానీ, కొత్తవి, మంచివీ ఏమీ లేవు. ఆ మాటలు నమ్మి ఈ పౌండ్రక వాసుదేవుడికి ఓటేసి గెలిపించిన ప్రజలు ఏమి చేయాలో ఆలోచించుకోవాలి. మరి ప్రపంచం అంతా అసమర్థుడి లాగా చూస్తున్న ఈయన పాలనలో ప్రజలకు ఏమైనా మంచి జరుగుతుందన్న ఆశ ఇంకా వుందా ప్రజలకు? ఈ కష్ట సమయంలో ఏమి చేయాలో విజ్ఞులైన ప్రజలే ఆలోచించుకోవాలి. మేధ, ప్రజ్ఞ, ధైర్యం, కలిగిన అసలు నాయకుడి పాలన బాగుందా? వెనుకబడిన రాష్ట్రాన్ని కేవలం తొమ్మిదిన్నరేండ్లలో సంపన్న రాష్ట్రంగా రూపుదిద్దిన ఆ నాయకుడు కావాలా? అసమర్థ, అవినీతి నకలు నాయకుడు కావాలా? తేల్చుకోండి!




## వృద్ధి సరే.. వేతన క్షీణత సంగతి?



**భారత్ జీడీపీ వార్షిక వృద్ధి రేటు 2022 నుంచి 2024 నాటికి 6.7 శాతానికి పెరిగింది. నిఫ్టీలో నమోదైన 500 సంస్థల లాభాలు వేగంగా పెరిగాయి. కానీ అదే కాలంలో దేశ శ్రామిక వర్గాల ఆర్థిక పరిస్థితి క్షీణిస్తూనే ఉంది. వాళ్ల వేతనాలు 0.07 శాతం తగ్గాయి. ఈ విషయాన్ని మనం చూడకుండా వదిలేయకూడదు.**

- **కౌశిక్ బసు**, ప్రముఖ ఆర్థిక వేత్త